www.vishalabharati.com
epaper:vishalabharati.com

పాలిట్రిక్స్

2023-2024

విశాల భారతి
vishalabharathi Telugu Daily
బుధవారం, 22.11.2023
హైదరాబాద్
1pm edition

పాలిట్రిక్స్

సోషల్ మీడియా ప్రచారానికి కోట్లకు కోట్లు!

- అడ్డగోలుగా డబ్బులు కుమ్మరిస్తున్న పార్టీలు..
- నిఘా పెట్టిన ఎన్నికల సంఘం

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

తెలంగాణ ఎన్నికల ప్రచారం కరపత్రాల నుంచి కార్పొరేట్ స్థాయికి చేరింది. బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలతో పాటు.. సోషల్ మీడియాలో కూడా ప్రచారం హోరెత్తుతోంది. పంచ్‌లు, కార్టూన్లు, స్పూఫ్ వీడియోలు, సర్వేలు, సవాళ్లు.. ఇలా డిజిటల్ ప్రచారాలతో పార్టీలు దూసుకుపోతున్నాయి. సోషల్ మీడియాను ప్రభావితం చేసే వ్యక్తులను ఆశ్రయిస్తూ, డిజిటల్ ప్రచారానికి కోట్లు కుమ్మరిస్తున్నారు. అయితే.. సామాజిక మాధ్యమాల ప్రచారంపై ఎన్నికల సంఘం ఫుల్ ఫోకస్ పెట్టింది.

తెలంగాణ ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా కీలక పాత్ర

సోషల్ మీడియా.. ఇదో పెద్ద వేదిక. జనాలతో కమ్యూనికేట్ అవ్వాలన్నా, మనుషులను తప్పు దారి పట్టించాలన్నా, వెబ్ దునియాలో ఉన్న మెయిన్ ప్లాట్ ఫామ్ ఇది..! మన చుట్టూ ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు, అరచేతిలోకి వచ్చిన అద్భుత టెక్నాలజీ. సామాన్యుల నుంచి సంపన్నుల దాకా అందరూ అందిపుచ్చుకుంటున్న సాధనం.! అందుకే.. తెలంగాణ ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తోంది. పార్టీలు పబ్లిక్ వార్‌తో పాటు సోషల్ మీడియా వార్‌కు సైతం సై అంటున్నాయి. తెలంగాణ ఎన్నికల్లో.. నేరుగా జరిపే ప్రచారం కంటే.. సోషల్ మీడియా డిజిటల్ ప్రచారాలే ఎక్కువుగా ఆకట్టుకుంటున్నాయి. రకరకాల పాటలు, కామెడీ స్కిట్లు, సెలబ్రిటీలతో స్టేట్మెంట్లు, కొన్ని పార్టీలు అయితే.. సోషల్ మీడియా ప్రభావితం చేసే వ్యక్తులతో.. స్టెప్పులు కూడా వేయిస్తున్నాయి.

ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచార ఖర్చు 40 లక్షలు

ఎమ్మెల్యే అభ్యర్థికి రూ. 40 లక్షలు మాత్రమే ప్రచారం కోసం ఖర్చు పెట్టుకునే వెసులుబాటు ఉంది. ప్రచారం కోసం వాడే జెండాలు, హోర్డింగులు, టీవీ, పేపర్ అడ్వటైజ్మెంట్లతో కలిపి రూ. 40 లక్షలు దాటకూడదు. సభలు సమావేశాలు ఖర్చు కూడా ఇందులోనే ఉంటుంది. ఎన్నికల తర్వాత పోటీ చేసిన ప్రతి అభ్యర్థి, తమ ఖర్చును ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలి. నిజానికి రూ. 40 లక్షల్లో ఏ అభ్యర్థి కూడా ప్రచారం ముగించలేడన్నదీ జగం ఎరిగిన సత్యం. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఇండిపెండెంట్ కూడా అంతకంటే ఎక్కువగానే ఖర్చు పెడుతున్నారు. కానీ.. ఎలక్షన్ కమిషన్ రాడార్‌కు దొరక్కుండా, రకరకాల ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అందులో ఒకటి సోషల్ మీడియా..! ఇక ఎలక్షన్లలో ప్రముఖంగా కనిపిస్తుంది గూగుల్ యాడ్స్. గూగుల్లో ఏది ఓపెన్ చేసినా, యూట్యూబ్ లో ఏ వీడియో చూసినా, ముందుగా రాజకీయ పార్టీల యాడ్స్ కనిపిస్తున్నాయి. ఇందుకు భారీ ఎత్తున ఖర్చు పెడుతున్నాయి ఆయా పార్టీలు. తమకున్న ఎన్నారైలను వినియోగించి, అక్కడ నుంచి యాడ్స్ పబ్లిష్ చేయిస్తున్నారు. ఒకవేళ ఎన్నికల కమిషన్ దీన్ని లెక్కలోకి తీసుకుందామనుకున్నా ఆ ఖర్చు వివరాలు తెలుసుకోవడం కష్టంగా మారుతుంది.

సోషల్ మీడియా ఖర్చుపై ఈసీ ఆరా

ఈ క్రమంలోనే.. సామాజిక మాధ్యమాలపై ఎన్నికల సంఘం నిఘా పెట్టింది. ఎన్నికల నియమాలు దాటితే వారిపై చర్యలు తీసుకునేందుకు సిద్ధం అవుతోంది. ప్రచారంలో భాగంగా అభ్యర్థులు సోషల్ మీడియాపై చేస్తున్న ఖర్చు వివరాలను ఈసీ ఆరా తీస్తోంది. ఆ ఖర్చును అభ్యర్థుల ఎన్నికల వ్యయం కింద లెక్కించాలని ఇప్పటికే అధికారులకు సూచించింది. మొత్తానికి... సామాజిక మాధ్యం ద్వారా ఎన్నికల నియమాలు ఎవరైనా అభ్యర్థులు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకునేందుకు ఎన్నికల సంఘం రెడీ అవుతోంది.

టీ ఎలక్షన్‌వార్‌పై బీజేపీ హైకమాండ్ ఫోకస్

- అగ్రనేతల ప్రచారంతో క్యాడర్‌లో ఫుల్‌జోష్
- ప్రచారంలో నిర్మలా సీతారామన్, ఫడ్నవీస్
- 21 మంది కాంగ్రెస్‌అభ్యర్థులకు బీఆర్ఎస్‌పైసలు
- సంచలన కామెంట్స్‌చేసిన మురళీధర్‌రావు

విశాల భారతి, స్టేట్‌బ్యూరో: తెలంగాణ దంగల్‌పై బీజేపీ ఫుల్‌గా ఫోకస్ పెట్టింది. అగ్రనేతల ప్రచారంతో క్యాడర్ జోష్‌గా దూసుకెళ్తోంది. మరోవైపు మోదీ, అమిత్ షా, నడ్డా ఒకరెనక ఒకరు జాతీయ నేతలు ప్రచారపర్వంలోకి వస్తున్నారు. మంగళవారం కేంద్రమంత్రి నిర్మాల సీతారామన్ జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి తరపున ప్రచారం చేశారు. బంగారంలాంటి తెలంగాణను అప్పుల కుప్ప చేశారంటూ కేసీఆర్ సర్కార్‌పై నిర్మల విమర్శలు సంధించారు. తెలంగాణకు నిధులు నిలిపివేశారన్న ఆరోపణలపై నిర్మాల సీతారామన్ ఘాటుగా స్పందించారు. నిబంధనల ప్రకారం నిధులు ఇచ్చాం.. కండీషన్స్ పాటించికపోతే అదనంగా అప్పులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కేసీఆర్‌ను జాతీయ నేతగా ఎవరూ అంగీకరించలేదన్నారు. కేసీఆర్ సర్కార్ అవినీతిపై విచారణ జరిపిస్తామన్నారు. మోటార్లకు మీటర్లనేది అబద్ధమన్నారు నిర్మలా. అటు మహారాష్ట్ర మాజీ సీఎం ఫడ్నవీస్, కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌తో కలిసి ముషీరాబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అవినీతిలో బీఆర్ఎస్‌కు మెడల్ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు ఫడ్నవీస్. మహారాష్ట్రలో బీఆర్ఎస్‌కు స్థానం లేదన్నారు. తెలంగాణలో కూడా బీఆర్ఎస్ దుకాణం బందన్నారాయన. బీఆర్ఎస్ కాంగ్రెస్..ఎంఐఎం టార్గెట్‌గా బీజేపీ విమర్శలకు పదను పెడుతోంది. 21 మంది కాంగ్రెస్ అభ్యర్థులకు బీఆర్ఎస్ డబ్బులిస్తోందని బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఎంఐఎం ఆస్తులను జప్తు చేస్తామని ఆయన హెచ్చరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ వేములవాడలో వికాస్.. గజ్వేల్‌లో ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. ఓవైపు అభ్యర్థుల ప్రచార హోరు.. మరోవైపు వరుసగా అగ్రనేతల టూర్లు.. వెరసి కమళదళం క్యాంపెయినింగ్ కలర్‌ఫుల్‌గా దూసుకెళ్తోంది.

సబితా వద్దు.. కాంగ్రెస్ ముద్దు!

- మహేశ్వరంపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్
- సర్కారు వైఫల్యమే అస్త్రంగా ప్రజల్లోకి
- ఆరు గ్యారంటీలపై ప్రజల్లో వస్తున్న ఆదరణ
- మైనార్టీల మద్దతు తనకే.. విజయంపై కేఎల్ఆర్ ధీమా

> తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహేశ్వరం నియోజకవర్గంలో ముక్కోణపు పోటీ నెలకొన్నది. ఇక్కడి నుంచి గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఈ సీటుపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. కాంగ్రెస్ పార్టీ నుంచి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్) బరిలో నిలిచారు. బీఆర్ఎస్ నుంచి మంత్రి సబితా ఇంద్రారెడ్డి బరిలో నిలవగా.. బీజేపీ తరపున శ్రీరాములు పోటీ చేస్తున్నారు. ముందునుంచి కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న మహేశ్వరంలో ఈసారి కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలన్న సంకల్పంతో కేఎల్ఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి ప్రచారంలో ముందున్నారు. ఇటీవల తనను భయపెట్టేందుకు ప్రత్యర్థులు ఐటీ దాడులు చేసినా వెరవక ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని సీనియర్ నేతలను కలుపుకుంటూ పోతున్నారు.

విశాల భారతి, స్టేట్‌బ్యూరో:

కాంగ్రెస్ కు కంచుకోట

నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఇబ్రహీంపట్నం, మలక్‌పేట్ నియోజకవర్గాల నుంచి విడిపోయి 2009లో మహేశ్వరం ఏర్పడింది. కందుకూరు, సరూర్‌నగర్, బాలాపూర్, మహేశ్వరం మండలాలతోపాటు ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్లతో ఏర్పాటు చేశారు. నియోజకవర్గానికి రెండుసార్లు ఎన్నికలు జరిగాయి. 2009లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. అప్పుడు పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి గెలిచి వైఎస్సార్ కేబినెట్లో హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2014లో టీడీపీ తరపున తీగల కృష్ణారెడ్డి విజయం సాధించి, అనంతరం కారెక్కారు. 2018లో కూడా సబితా ఇంద్రారెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున విజయం సాధించారు. ఆమె కు 95481 ఓట్లు వచ్చాయి. అనంతర కాలంలో ఆమె కూడా టీఆర్ఎస్ పార్టీ చేరి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. మూడు ఎన్నికల్లోనూ రెండు దఫాలు నియోజవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారు. దీంతో ఈసారి ఎలాగైన విజయం సాధించేందుకు కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్ఆర్ ప్రత్యేక వ్యూహాలతో ప్రచారంలో దూసుకుపోతున్నారు.

సర్కారు వైఫల్యమే అస్త్రంగా ప్రచారం

కాంగ్రెస్ నుంచి పోటీ ఉన్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలంగాణ సర్కారుపై ఉన్న వ్యతిరేకతను అస్త్రంగా చేసుకొని ప్రజల్లోకి వెళ్తున్నారు. కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలను ఎండగడుతున్నారు. దీంతోపాటు తాజా, మాజీ ఎమ్మెల్యే సబితపై ఉన్న వ్యతిరేకతను, అసమర్థతతో నియోజకవర్గం వెనుకబడిందని ఆరోపిస్తున్నారు. ఈ అంశాలను ప్రచారం చేస్తూ విరివిగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను అన్ని వర్గాల ప్రజలకు తెలియజేస్తున్నారు. తాము అధికారంలోకి వచ్చి అభివృద్ధి చేస్తామని అంటున్నారు. తనను గెలిపిస్తే మహేశ్వరం నియోజకవర్గ రూపురేఖలను మార్చేస్తానని ప్రజలకు వివరిస్తున్నారు. గెలిచిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతున్నారు.

వారి ఓట్లే నిర్ణయాత్మకం

మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోకి వచ్చే ప్రాంతాలు గతంలో కాంగ్రెస్ కు కంచుకోటగా ఉన్న ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో భాగంగా ఉండేవి. లోక్ సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన సందర్భంగా ఎల్బీనగర్ నుంచి మహేశ్వరం విడిపోయింది. ఇటీవల మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని తుక్కుగూడ మండలంలో విజయభేరి బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్ తన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఇది కాంగ్రెస్ అభ్యర్థి గెలుపుకు దోహదం చేస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ సభకు ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ సహా పార్టీ సీనియర్ నేతలు హాజరయ్యారు. మహేశ్వరంలో పరిధిలో జల్ పల్లి మున్సిపాలిటీలో సుమారు 70 వేల ముస్లిం ఓట్లు ఉన్నాయి. ఈ ఓట్లే నిర్ణయాత్మకంగా ప్రధాన పాత్ర పోషించనున్నాయి. 'ముస్లిం డిక్లరేషన్', 'ఆరు హామీలు'తో కాంగ్రెస్ వారిని ఆకట్టుకోవడంలో ముందుంది. మైనార్టీ వర్గాల మద్దతుతో ఈసారి విజయం సాధిస్తానని కేఎల్ఆర్ విజయంపై ధీమా వ్యక్తం చేశారు.

సబితా ఇంద్రారెడ్డి ఓటమి ఖాయం: -కేఎల్ఆర్

తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఓడించి.. కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలు డిసైడ్ అయ్యారన్నారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి. మహేశ్వరంలో సబిత వద్దు.. కాంగ్రెస్ ముద్దు అన్న ఉద్యమం జరుగుతోందన్నారు. సబిత కాంగ్రెస్‌ను మోసం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో మహేశ్వరం నియోజకవర్గానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఎప్పటి నుంచో తాను సేవా కార్యక్రమాలు చేస్తున్నానని.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించానని గుర్తుచేశారు. మహేశ్వరంలో కాంగ్రెస్‌కు బీజేపీ మధ్యే పోటీ అని తేల్చి చెప్పారాయన.

ఓటర్ల సంఖ్య ఇలా..

మొత్తం:	546577
పురుషులు:	281203
స్త్రీలు:	265307

'ఎర్రబెల్లి' కుట్టు మిషన్ల కట్టు కథలు!

- ప్రభుత్వ పథకాల అమలులో దయాకర్‌రావు బరితెగింపు
- 'సెర్ప్, స్త్రీనిధి' స్కీమ్స్ ద్వారా మహిళలకు టైలరింగ్ శిక్షణ
- తన ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పిస్తున్నానని అబద్ధాలు ప్రచారం
- కుట్టు మిషన్ల ట్రైనింగ్‌లోనూ దయాకర్‌రావు సెల్ఫ్‌గోల్
- ఆది నుంచి అదే పంథాలో పాలకుర్తి లో సొంత డబ్బా
- మహిళల ఉపాధి శిక్షణలో ట్రస్టు పాత్ర లేదంటున్న ఆఫీసర్లు

పాలకుర్తి, విశాల భారతి:

'అధికారాన్ని ఒక బాధ్యతగా భావిస్తున్నాం' అని వేదికలు ఎక్కి సుద్దులు చెప్తున్న రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి, పాలకుర్తి బీఆర్ఎస్ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రభుత్వ పథకాల అమలులో బరితెగించి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గవర్నమెంట్ సొమ్ముతో అమలు చేసే పథకాలను సొంత డబ్బుతో ఉద్ధరిస్తున్నట్లు బిల్డప్ఇస్తున్నారని చర్చ నడుస్తోంది. మహిళలకు 'సెర్ప్, స్త్రీనిధి' స్కీమ్స్ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న స్కీములను తన ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీల నేతలు ఫైర్‌అవుతున్నారు. ఇటీవల పాలకుర్తి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో 'ఎర్రబెల్లి' తరుచుగా .. చాలా మంది మహిళలకు ట్రస్టు ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టు శిక్షణ, కుట్టు మిషన్లు అందించామంటూ చెబుతున్నారు. అయితే మంత్రి వ్యాఖ్యలపై ప్రతిపక్ష పార్టీల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ తానే ఇప్పించానంటూ మంత్రి అబద్ధాలు చెప్పడం సరికాదంటున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఎర్రబెల్లి నీచ రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు.

సరిగ్గా పని చేయని కుట్టు మిషన్లు.. మంత్రిపై కోపంగా ఉన్న మహిళలు

తమకు ఇచ్చిన కుట్టు మిషన్లు సరిగ్గా పని చేయడం లేదని శిక్షణ పొందిన మహిళలు వాపోతున్నారు. 30 రోజుల శిక్షణలో ఒక్కరోజు కూడా తాము గైర్హాజరు కాలేదని వారు చెబుతున్నారు. కూలీ పనులు వదులుకొని శిక్షణకు హాజరయ్యామని, కానీ తమకు నాసిరకం మిషన్లు ఇచ్చారని బాధపడుతున్నారు. ఛార్జీలు, కూలీ పని డబ్బులు పెట్టుకుంటే సొంతంగా మంచి మిషన్లు కొనుక్కునేవాళ్లమని, వాళ్లిచ్చిన మిషన్లకు రిపేర్ చేయించలేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు పున:ప్రారంభం కాగానే ప్రభుత్వ పాఠశాలల్లో దుస్తుల ఆర్డర్లు తమకే ఇప్పిస్తామని మంత్రి చెప్పారని, కానీ ఇప్పటి వరకు అలాంటిదేమీ జరగలేదని వారు అంటున్నారు. మంత్రి ఎర్రబెల్లికి ఓటు వేయాలని, లేకుంటే కుట్టు మిషన్లు లాక్కుంటామంటూ బీఆర్ఎస్ నేతలు బెదిరిస్తున్నారని బాధిత మహిళలు వాపోతున్నారు. కూలీ పని చేసుకునే తమను ప్రచారానికి రాకుంటే బాగుండదని వార్నింగ్ ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళలు మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పట్ల కోపంగా ఉన్నారు. అందుకే వారంతా కాంగ్రెస్ అభ్యర్థి యశస్విని రెడ్డికి మద్దతుగా నిలుస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

సెర్ప్, స్త్రీనిధి ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ

పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు, పెద్ద వంగర, రాయపర్తి, కొడకండ్ల, పాలకుర్తి, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో సెర్ప్, స్త్రీనిధి ఆధ్వర్యంలో మహిళలకు 30 రోజుల పాటు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం రూ. 5 కోట్లకు పైగా ఖర్చు పెట్టారు. ఈ కుట్టు శిక్షణ కోసం సెర్ప్ నుంచి రూ.10 వేలు, స్త్రీనిధి నుంచి రూ.7 వేల చొప్పున ఒక్కొక్కరిపై రూ.17 వేలు ఖర్చు చేశారు. శిక్షణానంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతం ఎన్నికల ప్రచారంలో ఉన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కుట్టు శిక్షణ తానే సొంతంగా (ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారా) ఇప్పించినట్లు అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కుట్టు మిషన్ల వ్యవహారంలో మంత్రి ఎర్రబెల్లి వ్యవహారం 'సొమ్మొకరిది సోకొకరిది అన్నట్లు' ఉందని ప్రచారం జరుగుతోంది.

మహిళల ఓట్ల కోసమే మంత్రి కుట్టు మిషన్ల డ్రామాలు ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు కుట్టు మిషన్ల డ్రామాలాడుతున్నారని విపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో తనకు ఎదరీత తప్పదనే ఉద్దేశంతోనే మంత్రి మహిళల ఓట్ల కోసం కొత్త నాటకానికి తెర తీశారని అంటున్నారు. కుట్టు శిక్షణపై ప్రచారంలో మంత్రి ఎర్రబెల్లి చెప్పేవన్నీ అబద్ధాలనేనని అంటున్నారు. ఎర్రబెల్లి ట్రస్ట్ ద్వారానే శిక్షణ ఇప్పిస్తే ప్రభుత్వ సొమ్ము ఎక్కడికి పోయిందని ప్రశ్నిస్తున్నారు. ఎర్రబెల్లికి ఎప్పుడూ ఎన్నికల్లో గెలవాలనే యావ తప్పా.. ప్రజల బాగోగులు పట్టవని వారు ఆరోపిస్తున్నారు. ఎన్నికలు రాగానే జిమ్మిక్కులు చేయడం, ఓటర్లను మభ్యపెట్టడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని మండిపడుతున్నారు. ఓటమి భయంతోనే ఎర్రబెల్లి ఈ తప్పుడు ప్రచారం చేస్తున్నారని, యశస్విని రెడ్డి చేతిలో ఎర్రబెల్లికి పరాభవం తప్పదని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.